

ప్రజా

# రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 01 సంచిక -321 పేజీలు - 08 వెల - 06/- ఆదివారం 23 ఫిబ్రవరి 2025


## చెత్త పన్నుకు ముగింపు

**చెత్త పన్ను విధించిన గత వైసీపీ ప్రభుత్వం**

**గత డిసెంబర్ 31న చెత్త పన్నును రద్దు చేసిన కూటమి ప్రభుత్వం**

**తాజాగా మున్సిపల్ చట్ట సవరణ తర్వాత గెజిట్ జారీ చేసిన ప్రభుత్వం**



అమరావతి, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):వైసీపీ ప్రభుత్వ హయాంలో విధించిన చెత్త పన్నును ఏపీ ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. గత ఏడాది డిసెంబర్ 31 నుంచి చెత్త పన్నును రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా మున్సిపల్ చట్ట సవరణ తర్వాత గెజిట్ విడుదల చేసింది. ఏపీలో ఇకపై చెత్త పన్ను ఉండదు. వైసీపీ ప్రభుత్వం చెత్త పన్నును విధించినప్పటి నుంచి అప్పుడు విపక్షంలో ఉన్న నేతలు విమర్శలు గుప్పిస్తూనే వచ్చారు. ఎన్నికల ప్రచారంలో సైతం ఈ అంశాన్ని అస్త్రంగా వాడుకున్నారు. తాము అధికారంలోకి వస్తే చెత్త పన్ను రద్దు చేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం చెత్త పన్నును రద్దు చేసింది.

## కుప్పకూలిన టన్నెల్

### ఎస్ఎల్బిసిలో ప్రమాదం

- సొరంగం పైకప్పు కూలి చిక్కుపడిన 8మంది
- టన్నెల్ బోరింగ్ సమయంలో 9మీటర్ల మేర కూలిన పైకప్పు
- ప్రమాదానికిసీపేజ్ వాటరే కారణం
- సురక్షితంగా బయటపడిన 42మంది కార్మికులు
- వీరంతా యుపి, జమ్మూకశ్మీర్కు చెందిన వారు
- సొరంగం లోపల 14కి.మీ దూరంలో దుర్ఘటన
- క్లిష్టంగా మారిన సహాయకచర్యలు
- ఎన్ఐఆర్ఎఫ్ బృందాలతో రెస్క్యూ ఆపరేషన్




2లో

### టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా

**సిఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి తెలుసుకున్న మోడీ**

ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ ఆరా తీశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు.



## ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు మద్దతు ప్రకటించిన జనసేన

**పాకాలపాటి రఘువర్మకు**

**మద్దతివ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయం**

**ఒకే మాట మీద నిలవాలని పార్టీ శ్రేణులకు సూచన**



2లో

## గ్రూప్-2 పరీక్ష వాయిదావేయలేం..

**ప్రభుత్వ లేఖకు బదులిచ్చిన ఏపీపీఎస్సీ**

**ఏపీలో గ్రూప్-2 మెయిన్స్**

**వాయిదా వేయాలంటున్న అభ్యర్థులు**

**ఏపీపీఎస్సీకి లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం**

**పరీక్ష యథాతథంగా**

**నిర్వహిస్తున్నామన్న ఏపీపీఎస్సీ**




2లో

## అమరావతి నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారు

**మార్చి 15నుంచి ప్రారంభం అవుతాయని వెల్లడి**

**30వేల మంది కార్మికులతో శరవేగంగా నిర్మాణ పనులు**

అమరావతి, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని అమరావతి పనుల ప్రారంభానికి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూస్తున్న వేళ కీలక సమాచారం వచ్చేసింది. మార్చి 15 నుంచి రాజధాని పనులు ప్రారంభంకానున్నట్లు వెల్లడించింది. .మిగతాది 2లో...



## 24 నుంచి అసెంబ్లీ

### మరో రెండ్రోజుల్లో ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

**జగన్ హాజరయ్యే అవకాశం!**

**జగన్ వైసీపీ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దయ్యే ప్రమాదం**

**అసెంబ్లీకి ఒకరోజు వచ్చి వెళ్లిపోయే ఆలోచనలో**

**జగన్, ఇతర వైసీపీ ఎమ్మెల్యేలు**

అమరావతి, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి 24 నుంచి జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాల తొలి రోజున రాష్ట్ర గవర్నర్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు.మిగతాది 2లో...






## ఇద్దరు ఐపీఎస్ అధికారులను రిలీవ్ చేసిన తెలంగాణ

**అంజనీ కుమార్, అభిలాష బిస్తను**

**రిలీవ్ చేసిన తెలంగాణ**

**జీవో జారీ చేసిన ప్రభుత్వ**

**ప్రధాన కార్యదర్శి శాంతికుమారి**

**కరీంనగర్ పోలీస్ కమిషనర్**

**రిలీవ్‌పై ఈసీకి ప్రభుత్వం లేఖ**

2లో

## మిర్చి రైతుల సమస్యలపై బాబుఫోకస్

**రైతు సంఘం నేతలతో చంద్రబాబు చర్చ**



అమరావతి,ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్): మిర్చి రైతుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. చంద్రబాబుతో రైతు సంఘం నేత మన్నవ సుబ్బారావు శనివారం ఏపీ సచివాలయంలో సమావేశం అయ్యారు.ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను మీడియాకు మన్నవ సుబ్బారావు వెల్లడించారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతు సంఘం నేత మన్నవ సుబ్బారావు తెలిపారు. .మిగతాది 2లో...

## వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు



**: మంత్రి నాదెండ్ల మనోహర్**

**నెల్లూరు జిల్లాలో మంత్రి నాదెండ్ల పర్యటన**

**సంగంలో రైసుమిల్లు, స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేసిన మంత్రి**

**క్యూఆర్ కోడ్ తో కూడిన రేషన్ కార్డులు ఇస్తామని వెల్లడి**

2లో



రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# గ్రూప్-2 పరీక్ష వాయిదావేయలేం..

**అమరావతి, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో రేపు (ఫిబ్రవరి 23) జరగాల్సిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను అభ్యర్థుల ఆందోళలను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేయాలని ఏపీ ప్రభుత్వం రాసిన లేఖకు ఏపీపీఎస్సీ బదులిచ్చింది. రేపటి పరీక్షను వాయిదా వేయలేమని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, గ్రాడ్యుయేట్లకు ప్రయోజనం కల్పించే నిర్ణయాలు తీసుకోలేమని ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది. అందుకే రేపు జరగాల్సిన పరీక్షను షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా నిర్వహిస్తున్నట్టు తెలిపింది. 2023లో గ్రూప్-2 పరీక్షల కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం... రోస్టర్ పాయింట్ల విధానంలో తప్పులున్నాయని, వాటిని సరిదిద్దాకే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని గత కొన్ని రోజులుగా అభ్యర్థులు ఆందోళనలు చేపడుతున్నారు.
గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీకి లేఖ రాసింది. అయితే, ఈ దశలో పరీక్షను వాయిదా వేయలేమని ఏపీపీఎస్సీ ప్రత్యుత్తరం ఇచ్చింది.

## ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు మద్దతు ప్రకటించిన జనసేన

**అమరావతి, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):**
శ్రీకాకుళం-విజయనగరం-విశాఖ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పాకాలపాటి రఘువర్మకు మద్దతు ఇస్తున్నట్టు జనసేన పార్టీ హైకమాండ్ నేడు ప్రకటించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి... ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం ఏ విధంగా జనసేన అండగా నిలుస్తుందో... ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఒకే మాట మీద నిలవాలని పవన్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఇవాళ జనసేన రాజకీయ వ్యవహారాల చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన జనసేన ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రదర్శించిన స్ఫూర్తినే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కనబర్చాలని నాదెండ్ల పిలుపునిచ్చారు. ఏపీలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలకు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుండగా, మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## 24 నుంచి అసెంబ్లీ

**(మొదటి పేజి తరువాయి)**బీఏసీ సమావేశం అనంతరం, ఈసారి అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరుగుతాయన్న అంశంపై స్పష్టత రానుంది. కాగా, ఈసారి వైసీపీ అధినేత జగన్ తో పాటు, ఆ పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలు కూడా అసెంబ్లీకి హాజరవుతారని తెలుస్తోంది. ఎందుకంటే... వరుసగా 60 పనిదినాల పాటు అసెంబ్లీకి హాజరుకాకపోతే, సదరు ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడుతుందని ఇటీవలే ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఓ ప్రెస్ మీట్ లో చెప్పారు. ఆ లెక్కన జగన్ కు అనర్హత ముప్పు పొంచి ఉందని సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో, శాసనసభ సభ్యత్వాలు రద్దయ్యే ప్రమాదం ఉండడంతో... జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు ఒక రోజు అసెంబ్లీ సమావేశాలకు హాజరై వెళ్లిపోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

## ఇద్దరు ఐపీఎస్ అధికారులను రిలీవ్ చేసిన తెలంగాణ

**అమరావతి, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):**
ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిస్తను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతలు చేపట్టేందుకు వీలుగా వారిని వెంటనే రిలీవ్ చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవోలో పేర్కొన్నారు. అలాగే, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి రిలీవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది.
కరీంనగర్‌లో ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున అభిషేక్ మహంతి విషయంలో నిర్ణయం తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు.
అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాలని కేంద్ర హోంశాఖ శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన అనంతరం డీవోపీటీ రెండు తెలుగు రాష్ట్రాలకు అఖిల భారత సర్వీసు అధికారులను కేటాయించింది. దీనిపై కొందరు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. తర్వాత డీవోపీటీ హైకోర్టులో పిటిషన్ వేసింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీలో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ఆదేశించింది.

## మిర్చి రైతుల సమస్యలపై బాబు ఫోకస్



**(మొదటి పేజి తరువాయి)**
సీఎం చంద్రబాబు రైతులకు సంబంధించి కొన్ని సూచనలు చేశారని అన్నారు. ఎకరాకు రూ.3 లక్షలు అవుతుందంటే సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. మిర్చి పంటలకు టెక్నాలజీ. వాడమని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. ఎలక్ట్రానిక్ కాటా ఉపయోగించమని సీఎం చెప్పారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయం అందుతుందని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకుంటాయని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. జగన్ వచ్చినపుడు నిజమైన రైతులు ఆందోళన చేయలేదని చెప్పారు. కిరాయి మూకలు వచ్చి ఆందోళన చేశారని మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు. అంతకుముందు మిర్చి రైతులు, యార్డు ట్రేడర్లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. మిర్చి రైతుల సమస్యలు, ప్రస్తుత మిర్చి ధరలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ, సహచర మార్కెంటింగ్ శాఖ, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గురుతు రాజశేఖర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత, వ్యవసాయశాఖకు సంబంధించి అధికారులు, ట్రేడర్లు సమావేశానికి హాజరయ్యారు. ముఖ్యంగా మిర్చి ధర గత కొంతకాలంగా తగ్గుతూ వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో భేటీ అయి రాష్ట్రంలో మిర్చి రైతుల సమస్యలపై వివరించడం, దానిపై కేంద్రం వెంటనే స్పందించి రాష్ట్రంలో చిల్లి ధర పరిస్థితిపై స్పందించి.. కేంద్రం నుంచి సహాయం అందిస్తామని చెప్పడంతో ఈరోజు గుంటూరు మిర్చి యార్డు ట్రేడర్లు, మిర్చి కొనుగోలు చేసే వర్తకులతో సీఎం కీలక సమావేశం నిర్వహించారు.

# అమరావతి నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారు

**(మొదటి పేజి తరువాయి)**
ఏప్రిల్ మొదటి వారం నుంచి అమరావతిలో 30 వేల మంది కార్మికులు పనులు చేస్తారని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో టెండర్లు ఖరారు ఆలస్యం అయ్యింది. టెండర్లు పిలుచుకోవచ్చు కానీ ఖరారు చేయవద్దని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు దాదాపు 62 పనులకు సీఆర్డీఏ, ఏడీసీ టెండర్లను పిలిచింది. సుమారు 40 వేల కోట్ల విలువైన పనులకు టెండర్ల పక్రియ కొనసాగుతోంది. మరో 11 పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి నిర్మాణాన్ని ప్రాధాన్య ప్రాజెక్టు తీసుకుంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ స్వయంగా అమరావతి ప్రాంతాల్లో పర్యటించి అక్కడ నిలిచిపోయిన పనులను పరిశీలించారు. తరువాత చెన్నై ఐఐటీ, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన నిపుణుల బృందం అమరావతి ప్రాంతాన్ని సందర్శించారు. అమరావతిలో సెక్రటేరియెట్, అసెంబ్లీ వంటి ఐకానిక్ భవనాల పటిష్టతపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. ఇక్కడ నిర్మాణాలకు ఎలాంటి ఢోకా లేదంటూ ఐఐటీ బృందం నివేదిక ఇచ్చింది. లాగే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్, ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు పటిష్టంగా ఉన్నాయని రిపోర్ట్ ఇచ్చారు. దాదాపు 40 వేల కోట్లకు సంబంధించి 62 పనులపై మార్చి 15 నుంచే శ్రీకారం చుట్టనున్నారు. మిగిలిన 11 పనులకు త్వరలో టెదర్లను పూర్తి చేసి రెండున్నరేళ్లలో అమరావతి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే అమరావతిలో పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్స్‌ను పూర్తిస్థాయిలో తొలగించేశారు. దీంతో నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం లేకుండా శరవేగంగా పనులు ముందుకు సాగుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు

**అమరావతి, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ రేషన్ కార్డులు ఆధునిక టెక్నాలజీతో క్యూ ఆర్ కోడ్ లను కలిగి ఉంటాయని తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ ఇవాళ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగం సమీపంలోని రైసుమిల్లును, జెండాదిబ్బ వద్దనున్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాము (స్టాక్ పాయింట్)ను మంత్రి తనిఖీ చేశారు. రైసుమిల్లును తనిఖీ చేసి ధాన్యం సేకరణకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెండా దిబ్బ వద్ద స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి స్టాకు వివరాలు, సరఫరా మొదలైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మహిళలనుద్దేశించి మాట్లాడారు. ఇది మహిళా పక్షపాత ప్రభుత్వమన్నారు. మహిళలందరూ కూడా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.
వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులను అందిస్తామని చెప్పారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దీపం-2 పథకం హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని, ఇందులో భాగంగా ఈ జిల్లాలో 4 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.
రాష్ట్రంలో 93.42 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, ఈ ఏడాది 1.50 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారం మహిళలందరూ తెలుసుకోవాలని, భాగస్వామ్యం కావాలని సూచించారు. మే నెల నుంచి అన్ని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కోసం మంచి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు.

# ప్రధాని మోదీ 2వ ముఖ్య కార్యదర్శిగా ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ నియామకం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ-2గా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ ఆమోదించింది. శక్తికాంత దాస్ భాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియమాకం అమల్లోకి వస్తుంది. ప్రధానమంత్రి టర్మ్ వరకు కానీ తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. పీకే మిశ్రా 2019 సెప్టెబర్ 11 నుంచి ప్రధానమంత్రికి పర్సనల్ సెక్రటరీగా ఉన్నారు. ఆరేళ్ల పాటు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్



గత ఏడాది డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. దీంతో ఆర్బీఐ 26వ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. 67 ఏళ్ల శక్తికాంత దాస్ 2018లో ఊర్జిత్ పటేల్ అకస్మాత్తుగా రాజీనామా చేయడంలో ఆర్బీఐ గవర్నర్ గవర్నర్ బాధ్యతలు చేపట్టారు. 1980 తమిళనాడు ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాస్ ఢిల్లీలోని సెయిట్ స్టీఫెన్ కాలేజీలో మాస్టర్ డిగ్రీ చేశారు. బర్మింగ్‌హామ్ యూనివర్శిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. 2016 నవంబర్‌లో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా శక్తికాంతదాస్ ఉన్నారు. 2017 జూలై 1 నుంచి పలు ప్రత్యక్ష పన్నులు జీఎస్టీలో విలీనం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2021లో ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన పదవికాలం ముగియాల్సి ఉండగా మరో మూడేళ్లు పదవీకాలాన్ని పొడిగించారు.

# కుప్పకూలిన టన్నెల్

**ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):**
ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ ఇంకా ప్రారంభం కాలేదు. టన్నెల్ ప్రమాదంపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతోంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది టన్నెల్‌లోనే చిక్కుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పదమూడు గంటలుగా వారు టన్నెల్‌లోనే ఉండిపోయారు. ప్రమాద ప్రాంతంలో నీరు, బురద, మట్టి ఉన్నట్లు గుర్తించారు.ప్రమాదం జరిగిన ప్రాంతానికి మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వచ్చాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సాగునీటి పారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై వారు సమీక్షించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ప్రమాద ఘటన సమాచారం అందుకున్న వెంటనే ఆయన హెలికాప్టర్ లో టన్నెల్ వద్దకు చేరుకున్నారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా టన్నెల్ కూలిపోయిన ప్రదేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు కార్మికులు సొరంగం లోపలికి వెళ్లారని, ఉదయం 8.30 గంటలకు బోరింగ్ మెషీన్ ను ఆన్ చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. 20 మీటర్లు డ్రిల్లింగ్ చేయగానే టన్నెల్ లోకి నీళ్లు లీక్ అయ్యాయని వివరించారు. టన్నెల్ లో ఒకవైపు నుంచి నీరు లీక్ కావడంతో మట్టి కుంగిపోయిందని తెలిపారు.
బోరింగ్ మెషీన్ ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టాడని, దాంతో బోరింగ్ మెషీన్ వెనకున్న 42 మంది కార్మికులను బయటికి పంపించివేశారని మంత్రి



ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. బోరింగ్ మెషీన్ కు ముందున్న 8 మంది బయటికి రాలేక టన్నెల్ లోపల చిక్కుకున్నారని తెలిపారు. వారిలో ఇద్దరు విదేశీ ఇంజినీర్లు, ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. విదేశీ ఇంజినీర్లు మినహా మిగిలిన వారు యూపీ, ఝార?ండ్ కు చెందిన వారు అని వివరించారు. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని ప్రాణాలతో కాపాడేందుకు సర్వశక్తులా కృషి చేస్తున్నామని అన్నారు. 14 కిలోమీటర్ల లోపల ఉన్నందున సహాయ చర్యలు క్లిష్టంగా మారాయని తెలిపారు. ఇలాంటి ఆపరేషన్స్ లో నిపుణలైన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకువస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ప్రమాద ఘటనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ లోపల చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావాలన్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని స్పష్టం చేశారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సుంకిశాల ఘటన మరువక ముందే మరో దుర్ఘటన జరగడం ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌పై పారదర్శకంగా విచారణ జరిపించాలని అన్నారు.

## టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ ఆరా తీశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు. సొరంగంలో ఎనిమిది మంది చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఘటనా స్థలికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు ప్రధాని మోదీ.. సీఎంకు చెప్పారు. పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. విజయవాడ నుంచి రెండు, హైదరాబాద్ నుంచి ఒక బృందం ఘటనా స్థలికి చేరుకున్నాయి. సింగరేణి నిపుణుల బృందం కూడా అక్కడికి వెళ్లనుంది. నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. అకస్మాతుగా పైకప్పు కూలింది. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకి రాగా.. 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నారు.

# క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

- అట్టహాసంగా ప్రారంభమైన పదవ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల,జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలు.
- పాల్గొన్న ఉమ్మడి 13 జిల్లాల క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి.










**కర్నూలు ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్)**
ప్రతిభ చూపి పథకాలు సాధించే క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత్ర రెడ్డి అన్నారు.శనివారం కర్నూల్ నగరంలోని అవుట్డోర్ స్టేడియం నందు హ్యాండ్ బాల్ కర్నూల్ డిస్టిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల, జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలను సిఐడి సర్కిల్ ఇన్స్పెక్టర్ నగేష్, జిల్లా ఒలంపిక్ సంఘం సీఈవో విజయ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, రాయలసీమ యూనివర్సిటీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శివ కిషోర్,జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి,సర్వీసెస్ హ్యాండ్ బాల్ టీం కోచ్ కాసింసాహెబ్, సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు మాధవరావు తో కలిసి జ్యోతి ప్రజలను చేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారుల సంక్షేమం కోసం స్పోర్ట్స్ కోట రిజర్వేషన్లు మూడు శాతానికి పెంచిందని అన్నారు. గత ఏడాది నేషనల్ గేమ్స్ లో పాల్గొని విజేతలైన క్రీడాకారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా నిలిచి నగదు ప్రోత్సాహాలను అందించారని గుర్తు చేశారు. క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొని రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో సాధన చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు శారీరక అభివృద్ధి జరుగుతుందని అన్నారు.అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐడి) నగేష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు కొంత సమయం క్రీడా సాధనకు కేటాయిస్తే మేటి క్రీడాకారులుగా రాణించవచ్చని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడా సాధన వైపు మొగ్గు చూపేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.అంతకుముందు అతిథులు పతాకావిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి,జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, సంఘం కార్యవర్గ కార్యదర్శి సునీల్ కుమార్, రాష్ట్ర హాండ్ బాల్ సంఘం ప్రతినిధులు, పీఈటీలు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్తు కౌంటర్లు యధావిదంగా పనిచేయడను

### ఏం.ఉమాపతిసూపరింటెండెంటు ఇంజనీరు (ఆపరేషను సర్కిల్)

### ఎ.పి.యస్.పి.డి.సి.యల్, కర్నూలు



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 22(రిపబ్లిక్ న్యూస్):** కర్నూలు మరియు నంద్యాల జిల్లాలకు చెందిన విద్యుత్తు వినియోగదారులకు అందరికి తెలియజేయడము ఏమనగా, రేపు 23.02.2025 ఆదివారము సెలవు దినము అయినప్పటికీనూ విద్యుత్తు బిల్లుల కౌంటర్లు యధావిధిగా పనిచేయబడును. కావున ' వినియోగదారులు ఈ అవకాశమును సద్వినియోగము చేసుకొని విద్యుత్తు బిల్లులు చెల్లించ వలసినదిగా తెలియజేయడమైనది.

## పాములపాడులో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




పాములపాడు ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్):-మండల కేంద్రమైన పాములపాడులోని, సిపిఎం పార్టీ కార్యాలయం దగ్గర శ్రీశైలం కాలినడకన వెళుతున్న భక్తులకు సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో చలికేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. చలివేంద్రాన్ని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసు రత్నం రిబ్బన్ కటింగ్ చేసి, ప్రారంభించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ వేలాది మంది భక్తులు కాలినడకన శ్రీశైలం కు వెళ్తున్నటువంటి భక్తులకు ఈ చలివేంద్రము ఎంతో మందికి దాహం తీర్చే లాగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈరోజు ఫిబ్రవరి నెలలో చివరి దశలో ఎండలు బాగా ఉన్నాయని, దీనిని భక్తులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి డి.స్వామన్న మండల కమిటీ సభ్యులు ఎం.రాజు, ఏసేపు, తిరుపతయ్య, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్, మాల మహానాడు మండల అధ్యక్షుడు మేకల.జాన్ బాబు, మైనార్టీ నాయకులు ఖాజా, మహమ్మద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశం కోసం చేసిన త్యాగం మరువలేనిది

### జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య







**కర్నూలు ప్రతినిధి, ఫిబ్రవరి 22: (రిపబ్లిక్ న్యూస్)**
ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారు దేశం కోసం చేసిన త్యాగం మరువలేనిదని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పేర్కొన్నారు.. శనివారం ఉదయం 178 వ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జాయింట్ కలెక్టర్ నివాళులు అర్పించారు..ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారు గొప్ప స్వాతంత్ర సమరయోధుడు, గొప్ప విప్లవకారుడు అన్నారు.. మల్లారెడ్డి మరియు సీతమ్మ దంపతుల కుమారుడైన నరసింహారెడ్డి 1806 నవంబర్ 24న నంద్యాలలో రూపనగుడి గ్రామంలో జన్మించారన్నారు.. 1857లో ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగిందని అయితే అంతకు 10 సంవత్సరాల ముందే 1847లోనే నరసింహా రెడ్డి గారు ఈస్ట్ ఇండియా కంపెనీ మీద తిరుగుబాటు చేసిన చరిత్ర ఉందన్నారు.. ఈస్ట్ ఇండియా కంపెనీ మీద ఎదురుదాడి చేయడం,రైతులు కట్టే శిస్తుల పై వ్యతిరేక పోరాటం చేయడం ఆ విధంగా విప్లవకారుడిగా ప్రసిద్ధి చెందారన్నారు.... ఈస్ట్ ఇండియా కంపెనీ రెవెన్యూ శిస్తు కోసం రైతులను పట్టిపీడించడం వీటన్నిటికీ అయిన తిరుగుబాటు చేయడం ద్వారా శిస్తుభరణాన్ని కూడా ఆపారన్నారు... ట్రెజరీ ని ముట్టడించి బ్రిటిష్ అధికారిని హతమార్చడం జరిగిందన్నారు.. అందుకు సంబంధించి అతని మీద కేసు పెట్టి ఉరి తీయడం ద్వారా అతను వీర మరణం పొందారన్నారు... ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి ఏ మాత్రం భయపడకుండా హక్కుల కోసం పోరాడి ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు... ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట పటిమ, వీరత్వం, పౌరుషం ప్రతి ఒకరికి ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకం అన్నారు... సమాజం కోసం పనిచేయాలనే స్ఫూర్తిని ఇలాంటి గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.. స్వప్రయోజనం కోసం కాకుండా దేశం కోసం, సమాజం కోసం ప్రజల సంక్షేమ కోసం తిరుగుబాటు చేసి ప్రాణాలను అర్పించారన్నారు.. అతను కర్నూలు వాసి అవడం మనందరికి గర్వ కారణమన్నారు..అంతకుముందు కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తీ పాటి నాగరాజు, నంద్యాల పార్లమెంటు సభ్యులు శ్రీమతి బైరెడ్డి శబరి, పాణ్యం శాసనసభ్యులు చరిత, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య లు స్థానిక ఏ క్యాంప్ లో ఉన్న ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు .. కార్యక్రమంలో డిఆర్ఓ సి వెంకట నారాయణమ్మ, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, డీఎంహెచ్వో శాంతి కళ, పర్యాటక శాఖ అధికారి విజయ, మెప్మా పీడీ నాగ శివలీల, ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, తదితరులు పాల్గొన్నారు..

## రిలయన్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

### - విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయి రెడ్డి



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్:** దేశంలో ప్రఖ్యాతిగాంచిన కార్పొరేట్ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ అయిన రిలయన్స్ ఫౌండేషన్ చేస్తున్నటువంటి సామాజిక సేవలు అభినందనీయమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు.స్థానిక నంద్యాల రోడ్డులో ఉన్న విజ్ఞాన పీఠం అనాథ పిల్లల శిశు మందిరంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిల్లలకు మేధో శక్తిని పెంపొందించే పలు రకాల కిట్లను ఆయన పిల్లలకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు రిలయన్స్ ఫౌండేషన్ పంపిణీ చేస్తున్నటువంటి ఈ కిట్లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. వ్యాపార, పారిశ్రామిక రంగంలో ఎంతో ఉన్నత శిఖరాలకు చేరుకున్న రిలయన్స్ సంస్థ దేశంలో ప్రతి ఒకరు బాగుండాలి ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందాలి అన్న సదుద్దేశంతో ఫౌండేషన్ ద్వారా చేపడుతున్నటువంటి కార్యక్రమాలు ఎంతో అభినందించదగ్గమని, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేవని అభివర్ణించారు. ఇలాగే ఇక ముందు ముందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు రిలయన్స్ ఫౌండేషన్ విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షిస్తూ, ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు వినోద్, శ్రీనివాసరావు, విహెచ్పి నాయకులు మద్దిలేటి, వ్యాసరాజ్, విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన ఏఎస్పి



ఓంకారంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏఎస్పి జావలి

బండి ఆత్మకూరు,ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):- నల్లమల అటవీ ప్రాంతంలో శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వారు వెలసిన ఓంకార క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను నంద్యాల ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ ఐపీఎస్ పరిశీలించారు. శనివారం సాయంత్రం ఆమె ఓంకార క్షేత్రానికి చేరుకొనీ కోనేరు, క్యూలైన్లు పరిశీలించారు. వాహనాలు నిలపడం కోసం పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. వాహన రాకపోకల సమయంలో భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలెక్టర్ పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పై జగన్మోహన్ ని ఆమె ఆదేశించారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు, జాగారం చేసే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ ప్రసాద్ కు సూచించారు. అలాగే క్షేత్ర పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐనీ ఏఎస్పి ఆదేశించారు. వారి వెంట ఆలయ అర్చకులు మల్లికార్జునరావు ,పోలీస్ సిబ్బంది ఆలయ సిబ్బంది శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

# విష్ణునంది క్షేత్రంలో రైతు సంబరాలు

### రెండు కేటగిరిల్లో రాష్ట్రస్థాయి ఎద్దుల బల ప్రదర్శన

**బండి ఆత్మకూరు ,ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):-**
మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని విష్ణునందీశ్వర దేవస్థానం క్రిష్ణనంది క్షేత్రంలో ఈనెల 27, 28 తేదీల్లో రైతు సంబరాలు నిర్వహించనున్నట్లు శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మాజీ మెంబర్, టిడిపి సీనియర్ నాయకులు చిట్టి బోట్ల భరద్వాజ శర్మ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశానుసారం కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడు బన్నూరు రామలింగారెడ్డి నేతృత్వంలో టిడిపి మండల ఇన్చార్జి నందిపాటి నరసింహారెడ్డి, బి.కోడూరు టిడిపి నాయకులు కొండ మాల వెంకట చలమయ్య, ఇరగ దిండ్ల బాలుడు, వెంగలరెడ్డి పేట టిడిపి నాయకులు తోట శివయ్య, వెంకటాపురం శ్రీనివాసులుల ఆధ్వర్యంలో టీడీపీ మండల రైతు కమిటీ రాష్ట్ర స్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు రెండు కేటగిరీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 27న రెండు పండ్ల పాల దూడ్ల విభాగంలో ఎద్దుల బలప్రదర్శన పోటీలు జరగనున్నట్లు చెప్పారు. ఇందులో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ. 20 వేలు, మూడో బహుమతి రూ. 15 వేలు, నాలుగో బహుమతి రూ .10 వేలు, ఐదో బహుమతి రూ. 5 వేల ప్రకారం అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే 28 న ఆరు పండ్ల పాల దూడ్ల విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ .40 వేలు, రెండో బహుమతి,రూ .25 వేలు, మూడో బహుమతి రూ .20 వేలు, నాలుగో బహుమతి రూ .15 వేలు, ఐదో బహుమతి రూ. 10 వేల ప్రకారం అందజేయడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన రైతులు రూ 500 డిపాజిట్ చెల్లించి పోటీల్లో పాల్గొనాలని కోరారు.

## రెవెన్యూ పంచాయతీ రిజిస్ట్రేషన్ మున్సిపల్ అధికారులతో అవేర్నెస్ ప్రోగ్రాం






**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీ బి.లీలా వెంకట శేషాద్రి గారు ఈ రోజు అనగా 22-02-2025 న న్యాయ సేవా సదన్, కర్నూలు నందు జనన మరణ ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ మరియు వివాహ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే అంశాల పై రెవిన్యూ,పంచాయతీ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ అధికారులతో అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటుచేశారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గారు మాట్లడుతు హిందూ మ్యారేజ్ యాక్ట్ 1955 మరియు స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ 1945 ప్రకారం వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారని తెలిపారు. కర్నూలు రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ సందీప్ కుమార్ మాట్టాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకొన్నా 15 రోజుల లోపల మంజూరు చేస్తామని తెలిపారు. కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ మాట్టాడుతూ ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పల్లెలలో అయితే నెల ఆదాయం 10,000/- ఉంటే పట్టణంలో అయితే 12,000/- ఉంటే జారీ చేస్తామని తెలిపారు. మున్సిపల్ అదనపు కమీషనర్ ఆర్. జి. వి. కృష్ణా మాట్టాడుతూ మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు నమోదు చేసుకొన్నా ఏడు రోజుల్లో మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ జిల్లా ఆరోగ్య అధికారి విశ్వనాధ రెడ్డి,రిజిస్ట్రేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, పంచాయతీ సెక్రటరీ లు మరియు మునిసిపల్ జనన మరణ ధ్రువీకరణ కరణ అధికారులు పాల్గొన్నారు.

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888
ఆదివారం 23 ఫిబ్రవరి 2025

## 16వ వార్డు వాసులకు ఇంటి స్థలాలు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇవ్వాలి -సిపిఐ






కర్నూల్ ప్రతినిధి ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్):భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో ఈరోజు ధర్నా జరిగినది ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ నగర సహాయ కార్యదర్శి కామ్రేడ్ మహేష్ అధ్యక్షతన ధర్నా జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంలోని బుదువారిపేట వాసులకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ప్రభుత్వ రుణ సాయం చేయాలని సిమెంటు స్టీలు ఇసుక ఫ్రీగా ప్రభుత్వమే సప్లై చేయాలని ధర్నా సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సిపిఐ పార్టీగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేసి పోరాటాలు చేస్తూ పేదలందరికీ ఇళ్లు సాధించేంత వరకు పోరాటం చేస్తామని కచ్చితంగా ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పేదోడికి ఇంటి స్థలం ఇవ్వాలని ఎలాంటి షరతులు లేకుండా స్థలాలు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ధర్నా అనంతరం 37వ సచివాలయం వీఆర్వో గారికి ఇంటి స్థలాల అప్లికేషన్లు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి ఎం బిసన్న బుధవారపేట వాసులు కల్పన చాముండేశ్వరి మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మతోన్మాదం. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలి






**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్)** బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్య పోరాటాలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు స్థానిక కార్మిక కర్షక భవన్ నందు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన

సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు మైనార్టీలపై దాడులు చేస్తూ మైనార్టీలకు రక్షణ లేకుండా చేస్తున్నారని అన్నారు సమాజాన్ని ఐక్యంగా ఉంచే బాధ్యత కార్మిక వర్గానిదేనని అన్నారు నరేంద్ర మోడీ లేబర్ కోడ్లను తీసుకొని వస్తూ కార్మికులకు రక్షణ లేకుండా చేస్తున్నాడని అన్నారు లేబర్ కోడ్స్ కనుక అమలు అయితే కార్మికులు కట్టు బానిసలుగా మారాల్సిందేనని అన్నారు గత 20 సంవత్సరాలుగా కనీస వేతనాలు అమలు చేయడం లేదని గతంలో జగన్మోహన్ రెడ్డి పట్టించుకోలేదని నేడు చంద్రబాబు నాయుడు పట్టించుకోవడంలేదని విమర్శించారు కనీస వేతనాల జీవో విడుదల చేయడానికి ప్రభుత్వానికి ఒక పైసా కూడా ఖర్చు కాదని కానీ పెట్టుబడిదారులకు లొంగిపోయి కనీస వేతనాలు అమలు జరగకుండా చూస్తున్నాడని విమర్శించారు కార్మిక హక్కుల కోసం సిఐటియు నిరంతరం పోరాటాల నిర్వహిస్తుందని కార్మిక వర్గ పోరాటాలను మరింత ముందుకు తీసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందని అన్నారు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజిబాబు మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో రాష్ట్రస్థాయి సిఐటయు కార్యకర్తల కర్నూల్ లో నిర్వహిస్తున్నామని వర్క్ షాపు జయప్రదానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు అంగన్వాడి ఆశ మధ్యాహ్న భోజనం స్కూల్ స్కావెంజర్స్ రంగాలలో వస్తున్నటువంటి ఉద్యమాలను జయప్రదం చేయాలని కోరారు ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి రామాంజనేయులు పి ఈరన్న సిహెచ్ సాయి బాబా నాగేశ్వరరావుఎం గోపాల్ విజయ్ నారాయణస్వామి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు విమానాశ్రయానికి అధికారికంగా ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి పేరు పెట్టేలా కృషి చేస్తా

### నరసింహారెడ్డి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చేలా ప్రభుత్వంతో చర్చిస్తా. ఎం.పి బస్తిపాటి నాగరాజు






**కర్నూల్ ప్రతినిధి ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్)**కర్నూలు విమానాశ్రయానికి మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరును అధికారికంగా పెట్టేందుకు తన వంతు కృషి చేస్తానని ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఏ.క్యాంపు లో ఉన్న ఆయన విగ్రహానికి ఎం.పి పూలమాల వేసి నివాళులర్పించారు.. అనంతరం అక్కడే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎం.పి నాగరాజు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి దేశం కోసం చేసిన త్యాగం మరువలేనిదన్నారు.. బ్రిటిష్ పాలనను ఎదురించి సాయుధ పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.. తాను చిన్నతనంలో నర్సింహారెడ్డి పుట్టిన ప్రాంతమైన కోవెలకుంట్లలోనే విద్యాభ్యాసం చేశానని, ఆయన చేసిన పోరాటాలను వింటూనే పెరిగానన్నారు.. ఇక నరసింహారెడ్డి పేరు కర్నూలు విమానాశ్రయానికి అధికారికంగా పెట్టేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో చర్చించి త్వరలోనే పేరు పెట్టిస్తామన్నారు...అలాగే ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చేలా ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్తానని ఎం.పి నాగరాజు తెలిపారు..ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య, నంద్యాల ఎం.పి బైరెడ్డి శబరి, పాణ్యం ఎం.ఎల్.ఏ గౌరు చరిత, మాజీ ఎం.ఎల్.ఏ లు ఎస్వీ.మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి , మాజీ కేడీసీసీబీ చైర్మన్ విజయ మనోహరి, జిల్లా అధికారులు , ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి నాయకులు పాల్గొన్నారు..

## విశ్వ హిందు పరిషత్ లో బాధ్యత కలిగిన ప్రతి కార్యకర్తకు శిక్షణ అవసరం

### విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయిరెడ్డి




కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వద్ద గల విజ్ఞాన పీఠం (అరక్షిత శిశు మందిరం) లో విశ్వ హిందూ పరిషత్ 2 రోజులు జిల్లా "అభ్యాస వర్గ" ( శిక్షణా తరగతుల)ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన అనంతరం ఉద్ఘాటన సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ....విశ్వ హిందూ పరిషత్ సంస్థలో బాధ్యతలు తీసుకున్న, శిక్షణా నంతరం బాధ్యతలు తీసుకుంటున్న కార్యకర్తలందరికీ సంస్థ యొక్కవిధి,విధానాలు,లక్ష్యాలు,హిందూ సమాజం కోసం సంస్థ చేసే కార్యకలాపాల అవగాహన కోసం, సంస్థను గ్రామ గ్రామాన విస్తరించడం కోసం ప్రతి జిల్లా,ప్రఖండ, బస్తీ,గ్రామస్థాయి కార్యకర్తలకు రెండురోజుల జిల్లా అభ్యాసవర్గ(శిక్షణా తరగతులు) నిర్వహిస్తున్న ఈ శుభ సందర్భంలో శిక్షణకు వచ్చిన కార్,కర్తలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకట్రామయ్య మాట్లాడుతూ నూతనంగా గ్రామస్థాయి నుండి ఈ శిక్షణా తరగతులకు విచ్చేసిన కార్యకర్తలు రెండు రోజులపాటు ఇక్కడ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో శ్రద్ధతో ఇకైకడ చెప్పిన ప్రతి విషయాన్ని రాసుకుని, శిక్షణ పూర్తి అయిన తరువాత మీ మీ కార్యక్షేత్రాలలో విశ్వ హిందూ పరిషత్ కార్యకలాపాలను విస్తరించాలని తెలియజేశారు. విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాళిగి వ్యాసరాజ్,రాష్ట్ర సహకార్యదర్శి యస్.ప్రాణేష్, అభ్యాసవర్గ అధికారి అనంత విశ్వ ప్రసాద్, కర్నూలు జిల్లా అధ్యక్షులు టి.సీ.మద్దిలేటి, జిల్లా కార్యదర్శి, అభ్యాసవర్గ వ్యవహార కర్త మాళిగి భానుప్రకాష్,సహకార్యదర్శి శిక్షణా తరగతుల పర్యవేక్షకులు గూడూరు గిరిబాబు ,వ్యవస్థా ప్రముఖ్ ఈపూరి నాగరాజు, అయోధ్య శ్రీనివాస రెడ్డి, ఈపూరి లక్ష్మి, మాళిగి పావని, మరియు వివిధ గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జీ.బి.ఏం పాఠశాల 32వ వార్షికోత్సవం.






వెలుగోడు ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్. వెలుగోడు పట్టణంలో ఉన్న జీ.బి.ఏం పాఠశాల 32వ వార్షికోత్సవాన్ని యాజమాన్యం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పుస్తకాలతో క్షణం తీరిక లేకుండా ఉన్న విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. హెూం వర్క్, ప్రాజెక్టు పనులతో అలసిన వారు సేద తీరారు.తమలో దాగివున్న ప్రతిభను చూపి ఔరా అనిపించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి హాజరై మాట్లాడారు.తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని వారి యోగ క్షేమాలతో పాటు వారి మానసిక పరిస్థితిపై కూడా ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని ఆయన అన్నారు.విద్యార్థులు భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలనీ ఆకాంక్షించారు.విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కలిగించడంతోపాటు,భావి భారత పౌరులుగా ఎలా ఎదగాలో తెలియజేశారు.అదేవిధంగా విద్యార్థులు బాగా చదివి పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించి పాఠశాలకు,మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థినీ విద్యార్థులు విద్య పట్ల భయం లేకుండా విద్యను ఇష్టపడి అభ్యసనం చేసే పరిజ్ఞానాన్ని ఉపాధ్యాయులు కల్పించాలని కోరారు.వార్షికోత్సవ సమావేశం అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్ర శేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఫకీర్ అహ్మద్, ఇలియాస్, సుబ్బయ్య, అప్షపున్నిసా, సుష్మ, గీత,లక్ష్మి సులోచన, నందిత,విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ సమాజ సాధికారత ఉపాధి అవకాశాలు మరియు పరివర్తన వ్యూహాలు అంశంపై జాతీయస్థాయి సదస్సు



కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల నందు మార్చి 24 %ు%25 తేదీలలో జాతీయస్థాయి సదస్సును 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్' (ICSSR) వారి సహకారంతో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి. ఎల్లకృష్ణ నిర్వహించనున్నారు. ఈ జాతీయస్థాయి సదస్సు కు సంబంధించిన కరపత్రాలను ఇవాళ క్లస్టర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్. డి.వి.ఆర్. సాయి గోపాల్ గారు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. వి. సుబ్రహ్మణ్య కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఆర్ ప్రసాద్ రెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ కే. నాగరాజశెట్టి, మరియు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు అందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లస్టర్ యూనివర్సిటీ విసి గారు మాట్లాడుతూ ఈ జాతీయ సదస్సులో అధిక సంఖ్యలో పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొని సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశమైన గ్రామీణ సమాజ సాధికారత నెరవేరేందుకు అవసరమైన ముఖ్య సూచనలు ఇవ్వవలసిందిగా పిలుపునిచ్చారు

## పాములపాడు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ డ్రిల్ ను తిలకించిన ఎమ్మెల్యే గిత్త.జయసూర్య







పాములపాడు ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్):- భారత స్కౌట్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ రాబర్ట్ స్టీఫెన్ సన్ స్మిత్ బడెన్ పావెల్ జన్మదినం సందర్భంగా వరల్డ్ థింకింగ్ డే మరియు స్కౌట్ డే గా ఫిబ్రవరి 22 వ తేదీని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాములపాడు ఆదర్శ పాఠశాలలో గత నెలలో స్కౌట్ మరియు గైడ్ యూనిట్ ని ఏర్పాటు చేయడం జరిగింది. వారిచే ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నాగ రవీంద్ర,స్కౌట్ మాస్టర్- మధు, గైడ్ కెప్టెన్. వత్సల స్కౌట్ మరియు గైడ్ పిల్లలచే అద్భుతంగా స్కౌట్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విచ్చేసిన ఎమ్మెల్యే గిత్త.జయసూర్య కి స్కౌట్ యూనిట్ తరపున ప్రత్యేకమైన స్కౌట్ స్కార్ఫ్ ని హానర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అలాగే మండల రెవెన్యూ తహసిల్దార్- జి.సుభద్రమ్మ, ఎంపీడీవో-ఎన్. చంద్రశేఖర్, ఎంఈఓ- బాలాజీ నాయక్ లను స్కౌట్ స్కార్ఫ్ తో సత్కరించడంజరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త.జయసూర్య మాట్లాడుతూ స్కౌట్లను నియమించే ముఖ్య ఉద్దేశం ప్రజలకు స్వచ్ఛందంగా అన్ని వేళలలో సహాయ సహకారాలు అందించడం. కాబట్టి పాములపాడు మండల ప్రజలకు మాతోపాటు, మీరు కూడా సేవలందించడానికి ముందుకు రావడం, చాలా ఆనందంగా ఉందని స్కౌట్ యూనిట్ ని మరియు పాఠశాల ప్రిన్సిపల్- నాగ రవీంద్ర ని, ఉపాధ్యాయులను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాములపాడు గ్రామ సర్పంచ్-మేకల.భాగ్యమ్మ, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ వేణుగోపాల్, కో ఆప్టెడ్ మెంబర్ రామ్మోహన్, పాఠశాల పి.డి- కె.సాయి కృష్ణ, నాగమల్లయ్య, మరియు ఉపాధ్యాయులు, నాయకులు ఎం.రాజశేఖర్, స్కౌట్ విద్యార్థిని,విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

## మోడల్ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోండి.

వెలుగోడు ఫిబ్రవరి 22 రిపబ్లిక్ న్యూస్ వెలుగోడు పట్టణ మోడల్ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నళిని శనివారం నాడు తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీన మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించ పడుతుందన్నారు.ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుండి 12:00 వరకు ఉంటుందన్నారు.పరీక్ష తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియంలలో ఉంటుందన్నారు .ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే ఓసి మరియు బిసి విద్యార్థులు సెప్టెంబర్ 1,2013 నుండి ఆగస్టు 31 2015 వరకు జన్మించిన వారు, అదేవిధంగా ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 1,సెప్టెంబర్ 2011 నుండి ఆగస్టు 31 2015 వరకు జన్మించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.దరఖాస్తు ల ను ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు ఓసి, బీసీ విద్యార్థులకు 150 రూపాయలు ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 75 రూపాయలు ఫీజు ఉంటుందన్నారు ఓ సి, బి సి విద్యార్థులకు ప్రవేశ పరీక్షల్లో 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు గరిష్టంగాసాధించాలన్నారు .విద్యార్థులు ఎంపిక ప్రతిభ ఆధారంగా మరియు రిజర్వేషన్ ప్రకారం ప్రకటిస్తామన్నారు. పూర్తి వివరాలు కోసం మోడల్ స్కూల్ కార్యాలయంలోసంప్రదించాలన్నారు.

# పాములపాడు మండల ప్రజల సమస్యల వినతి పత్రాలను

## గ్రీవెన్స్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో స్వీకరించిన ఎమ్మెల్యే గిత్త.జయ సూర్య

పాములపాడు ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్):- ఈరోజు నందికొట్కూరు నియోజకవర్గం, పాములపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ లో ఎమ్మెల్యే గిత్త.జయసూర్య, ఎంపీడీవో-ఎన్. చంద్రశేఖర్, తహసిల్దార్- జి.సుభద్రమ్మ లతో కలిసి ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, మరియు పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే గిత్త.జయసూర్య కు మండల అధికారులు చేతికిచ్చి, ఘన స్వాగతం పలికారు. ఈ గ్రీవెన్స్ లో ఎమ్మెల్యే గిత్త.జయ సూర్యకు పాములపాడు గ్రామ సర్పంచ్ మేకల.భాగ్యమ్మ తరపున ఆమె కుమారుడు ఎం రాజశేఖర్, సోషల్ మీడియా ప్రతినిధి డక్కా.శ్రీకాంత్ లు గ్రామంలో ఒకటే నీళ్ల ట్యాంకు ఉన్నదని మరొక నీళ్ల ట్యాంకు మంజూరు చేయాలని, వైయస్సార్ కాలనీ, మరియు ఇతర కాలనీలకు కొత్త విద్యుత్ స్తంభాలు, వాటికి కలెక్షన్లు మంజూరు చేయాలని, బస్టాండ్ దగ్గరలో ప్రయాణికుల కొరకు, విద్యార్థుల కొరకు, ఉద్యోగస్తుల కొరకు పబ్లిక్ లెట్రిన్, బాత్రూంలో మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. వేంపెంట గ్రామ సర్పంచ్ వై. మాణిక్యమ్మ తరపునుండి రిటైర్డ్ గవర్నమెంట్ టీచర్ వై. దానమయ్య, నాయకులు కంభం. మోహన్ గౌడ్, ఆదిరెడ్డి లు బీసీ, ఎస్సీ,ఎస్టీ కాలనీలలో వేసవిని దృష్టిలో పెట్టుకొని కొత్త బోర్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఇస్కాల గ్రామం దగ్గర భవనాసి వాగుపై వంతెన నిర్మించాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు మేకల.జాన్ బాబు, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, జనసేన నాయకులు జి.సాయి కృష్ణ లు వినతిపత్రం సమర్పించారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని, పాములపాడు, కొత్తపల్లి, మిడుతూరు మండలాలలోని మెట్ట ప్రాంతానికి కొత్త ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ కార్యవర్గ సభ్యులు టి.వెంకటేశ్వరరావు కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.స్వామన్న, సిఐటియు నాయకులు ఎం.రాజు, రైతులు అంకన్న, భాస్కర్, సుధాకర్, జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వరరావు లు వినతి పత్రం సమర్పించారు.






మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వచ్చే వేసవిలో నీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల.నాగరాజు వినతిపత్రం సమర్పించారు. బిసి కార్పొరేషన్ సబ్సిడీ లోన్స్ పెంచాలని, బీసీల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ బిజెపి మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్ వినతిపత్రం సమర్పించారు. మండలంలో మినీ గోకుల పథకాల లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కొత్తవి శాంక్షన్ చేయాలని కోరుతూ జనసేన పార్టీ జన సైనికుడు రాము ఆధ్వర్యంలో రైతులతో కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. బానకచర్ల గ్రామంలో పేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేసి, కట్టించి ఇవ్వాలని కోరుతూ సిపిఐ పార్టీ నాయకుడు రమేష్ బాబు వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా పాములపాడు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరిస్తానని నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త.జయసూర్య హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "ఐదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనలో ఇబ్బందులు పడిన బాధితులు గ్రీవెన్స్ ప్రజా ఫిర్యాదుల సమావేశానికి పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందించారన్నారు.

ఈ కార్యక్రమంలో పాములపాడు మండలంలోని ఎంఈఓ బాలాజీ నాయక్, ఎంపీడీవో కార్యాలయం ఏవో ఎం.గాయత్రి, ఆర్ఐ- ఖాజాబి, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో- విమలమ్మ, హెడ్ కానిస్టేబుల్ ఎం.వి.రమణ, కానిస్టేబుల్ పవన్, మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, మిట్టకందాల గ్రామ మాజీ సర్పంచ్ జి.హరిప్రసాద్ యాదవ్, పాములపాడు గోవిందు, ఎర్రగూడూరు హరినాథ్ రెడ్డి, వాడాల జనార్దన్ రెడ్డి, భానుముక్కల బండ్లమూరి. వెంకటేశ్వరరావు, భానుముక్కల బండ్లమూరి చంద్రశేఖర్, ముసలిమడుగు రహీం ఖాన్, రుద్రవరం గ్రామ సర్పంచ్ వి. రామస్వామి, చెలిమిళ్ల మాజీ సర్పంచ్ ఆదినారాయణ, నాయకులు లచ్చల గౌడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పిఏ మద్దిలేటి, సోషల్ మీడియా ప్రతినిధి ప్రవీణ్,పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, సంబంధిత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మోటార్ సైకిల్ ఢీ వ్యక్తి మృతి

## మద్యం మత్తులో దుర్ఘటన



నంద్యాల ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్) : మద్యం మత్తులో దినేష్ రెడ్డి అనే వ్యక్తి అధిక వేగంతో బైక్ను ఢీకొనడంతో నిండు ప్రాణం బలి అయింది. టెక్కే మార్కెట్ యార్డ్ సమీపంలో శుక్రవారం రాత్రి 9:30 గంటలకు స్టాంప్ వెనడర్ గా పనిచేసే శంకర్(45) బైకుపై ఇంటికి తిరిగి వెళుతుండగా మద్యం మత్తులో దినేష్ రెడ్డి మరో ఇద్దరూ బైకుపై అధిక వేగంతో వచ్చి ఢీకొట్టారు. శంకర్ బండి పై నుండి బలంగా కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రజలు హుటాహుటిన శంకరును నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శనివారం తెల్లవారుజామున 5:30 కు కోలుకోలేక మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# సోగరాజు శేఖర్ కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహకారం చేసిన అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు,

**వేంపెంట మాజీ సర్పంచ్ టేకూరి.రామ సుబ్బమ్మ , కీర్తిశేషులు టేకూరి గాండ్ల కృష్ణుడు కుమారుడు,**

**వేంపెంట గ్రామ సోగరాజు వేదామణి పార్థివ దేహానికి పూలమాలవేసి, నివాళులర్పించిన తెలుగు దేశం నాయకులు**



పాములపాడు ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్):- నంద్యాల జిల్లా, నందికొట్కూరు నియోజవర్గం, పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామములో సోగరాజు శేఖర్ భార్య సోగరాజు వేదామణి అనారోగ్య కారణంగా చనిపోయిన విషయం తెలుసుకొని, సింగపూర్ లో ఉంటున్న అంతర్జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారుఈ సందర్భంగా సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు తెలుగుదేశం పార్టీ మీకు అన్ని విధాలుగా తోడుగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేంపెంట గ్రామ మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజ్, నీటి సంఘం డిసి -వైస్ ప్రెసిడెంట్ ఆల్ఫ్రెడ్, నెత్తికొప్పుల రత్నాకర్, గాండ్ల రాజేష్, వేమారెడ్డి, బోనపల్లె వినయ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్ లో రాయలసీమకు 42% నిధులను విడిగా కేటాయించాలి



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 22 (రిపబ్లిక్ న్యూస్)**

రాష్ట్ర బడ్జెట్ లో రాయలసీమ కు 42% నిధులను విడిగా కేటాయించాలని కోరుతూరాయలసీమ విద్యా వంతుల వేదిక రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఈ రోజు కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. వేదిక కో కన్వీనర్ విజయ భాస్కర రెడ్డి అధ్యక్షత వహించిన ఈ నిరసన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర బడ్జెట్ లో రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, A.P విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాయలసీమ లో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ, రాయలసీమ పశ్చిమ ప్రాంత వలసలను, కరువు నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుల ఉద్యోగులు కడప కేంద్ర కార్యాలయాన్ని కడప లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రజా సంఘాల నాయకులు యోహాను, సుంకన్న, శేషాద్రి రెడ్డి, PDSU రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, రంగముని నాయుడు, రాజా సాగర్, A.V.సుబ్బరాయుడు, కందనోలు కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు.

# ప్రతి విలేఖరికి అండగా ఉంటాము

## యునైటెడ్ జర్నలిస్టు ఫోరం :నగర కమిటీ ఎన్నిక...




**కర్నూలు ప్రతినిది ఫిబ్రవరి 22: (రిపబ్లిక్ న్యూస్)** విలేకరుల పై జరుగుతున్న దాడులను అరికట్టే దిశగా ప్రతి విలేకరికి యునైటెడ్ జర్నలిస్టు ఫోరం అండగా ఉంటుందది యునైటెడ్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు నీలం సత్యనారాయణ శనివారం కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కర్నూలు కార్యాలయం లో జరిగిన నగర కమిటీ ఎన్నిక కార్యక్రమం లో తెలియచేశారు ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులు విలేకరుల పై రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తున్న తీరును యు జె ఎఫ్ ఖండిస్తుందని మైక్ ముందు ఒక మాట స్టేజ్ వెనక ఒక మాటగా ఉండడం తో వారి అనుచరులు దాడులు చేయడానికి వెనకడడం లేదని ఈ పరిణామలపై పెయిడ్ ఛానెళ్లు పత్రికలు కొన్ని యూనియన్ లు మౌనం వహించడం చాలా బాధాకరమని ఈ విషయాల్ని దృష్టిలో ఉంచుకొని ఆవిర్భవించిందే యునైటెడ్ జర్నలిస్టు ఫోరం అని అందరూ విలేకరులను సంఘటితం చేస్తూ సమాజం లో విలేకరులపై జరిగే ప్రతి మంచి చెడుకు లకు ప్రతి ఒక్కరికీ కొండంత భరోసా గా నిలబడబోతున్న ఏకైక యూనియన్ గా నిలిచిపోతామని విలేకరుల కేవలం ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారదులుగానే చూసి ఉన్నారు చూస్తూ ఉన్నారు కానీ విలేకరుల హక్కులను




కాలరాస్తం సంక్షేమలను తొక్కేస్తం అంటే చూస్తూ ఊరుకోబోమని తెలియచేశారు అలాగే

కార్యదర్శి చిన్న రామాంజనేయులు మాట్లాడుతూలి గత 30 సంవత్సరాలనుండి నేను అనేక పత్రికలలో మరియు సంఘాలలో పనిచేశానని సంస్థలు మరియు యూనియన్ లు వారి వారి స్వలాభం కోసం వారి స్వార్థలకోసం కింది స్థాయిలో ఉన్న సభ్యులను విలేకరులను వాడుకున్నారే తప్ప ఇప్పటి వరకు ఏ సంఘం ఏ సంస్థ విలేకరులకు న్యాయం చేయలేదని వీటి నుండి విసిగి వేసారి యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం స్థాపించి జిల్లా రాష్ట్ర స్థాయిలో కమిటీలో ఏర్పాటు చేసి విలేకరుల కోసం పోరాడేందుకు ప్రభుత్వాల మెడలు వంచేందుకు కృషి చేస్తామని తెలియచేశారు అలాగే నగర కమిటీ ఎన్నికలో భాగంగా పి.నాగేంద్రుడు నగర అధ్యక్షునిగా, జి.మునిస్వామి ప్రధాన కార్యదర్శి యు.రాజశేఖర్ కోశాధికారిగా ఉపాధ్యక్షులుగా వి.ప్రసాదు సంజీవయ్య, ఎన్ కె మధు, సహాయ కార్యదర్శిలుగా జయ బాబు ,రవి, మధుసూదన్,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పి.రవి ,ఆర్. చంద్రశేఖర్ ,రవిచంద్ర గౌడ్, పి. సుంకన్న ,రాజు, పి.జయరాజు ,ఎన్.వజ్రరాజు ను నియమించడం జరిగిందని యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం కార్యదర్శి చిన్న రామాంజనేయులు తెలియజేశారు

ఈ సందర్భంగా నగర అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తామని జర్నలిస్టు సంక్షేమ అభ్యర్థిగా పనిచేస్తామని అలాగే విద్య రాయితీ ఇళ్ల స్థలాలు రైల్వే పాస్ లకు సంబంధించి అధికారులను కలిసి ఏర్పాటుకు కృషి చేస్తామని తెలియచేశారు

ఈ కార్యక్రమం లో సీనియర్ పాత్రికేయులు శ్రీనాథ్ రెడ్డి శేషి రెడ్డి ,జై కిసాన్ జై జవాన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు కంది వరుణ్ ,న్యాయ సలహాదారుడు ప్రసాద్ ,కోశాది కారి యూసఫ్ ఖాన్, ఉపాధ్యక్షులు విద్యాసాగర్, విజయ్, జి.విజయ్ ఆసిఫ్, గంగాధర్, రాజశేఖర్ కరణ్ చంద్ర పరమేష్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు



# మంచినీటి బోర్‌కు మరమ్మత్తులు

మహానంది, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్)

మహానంది మండలం మసీదుపురం గ్రామంలో నాలుగు నెలల నుంచి ఎస్సీ కాలనీ మాదిగ పేటలో బోరు చెడిపోవడం జరిగినది కానీ ఎన్నిసార్లు చెప్పినా సర్పంచ్ గారు పట్టించుకోవడం లేదు ఈరోజు క్లస్టర్ ఇంచార్జ్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి గారు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకుపోవడం జరిగినది తక్షణమే ఎమ్మెల్యే గారు అధికారులతో మాట్లాడడం జరిగినది వెంటనే అధికారులు గ్రామంలోకి వెళ్లి బోరును చూసి తక్షణమే రిపేరు చేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది అలాగే ఆగిపోయిన పైపులైన్లను కూడా ఎమ్మెల్యే గారు వెంటనే వెయ్యమని చెప్పడం జరిగినది తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే గారికి గ్రామ ప్రజలు ధన్యవాదాలు చెప్పడం జరిగింది




# మహానందీశ్వర దంపతులకు పట్టు వస్త్రాలు విరాళం



మహానంది, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్): మహానంది పుణ్య క్షేత్రంలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలలో స్వామివార్లకు ఉపయోగించేందుకు పట్టు వస్త్రాలను భక్తితో సమర్పించారు. శనివారం హైదరాబాద్కు చెందిన వారణాసి రామ్మోహన్రావు విజయలక్ష్మి దంపతులు పంపించిన పట్టు వస్త్రాలను ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఏఈఓ మధులు వేద పండితులు బ్రహ్మశ్రీ రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు అర్జునశర్మలకు అందజేశారు. బ్రహ్మోత్సవాలలో స్వామివార్లకు పట్టు వస్త్రాలను అలంకరించనున్నారు.

# తప్పు చేసిన వారికి కఠిన శిక్షలు తప్పవు

**మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో ముగ్గురు నిందితులు పై కేసు నమోదు, అరెస్టు.**

**సోషల్ మీడియా నందు వదంతులను, పుకార్లను వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.**

**సకాలంలో స్పందించిన జిల్లా ఇన్చార్జి ఎస్పి మరియు జిల్లా పోలీసు యంత్రాంగం.**

**శాంతి భద్రతల విఘాతం కల్పించే వారిపై ప్రత్యేక నిఘా.**

**జిల్లా ఇన్చార్జి ఎస్పి శ్రీమతి జానకి షర్మిల ఐపీఎస్.**





**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 22 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆదిలాబాద్ జిల్లా లో మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో జిల్లా ఇన్చార్జి ఎస్పి గారి నేతృత్వంలో తగిన సూచనలతో జిల్లా పోలీసు యంత్రాంగం సత్వరమే స్పందించి శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కల్పించకుండా నిందితులను సకాలంలో అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచి జిల్లా జైలుకు పంపడం జరిగింది. ఘటన వివరాలు తెలుసుకున్న జిల్లా ఇన్చార్జి ఎస్పి ఉటాటిన నిన్న రాత్రి RIMS ఆసుపత్రికి చేరుకుని సంబధిత అధికారులకు సూచనలు చేయటం జరిగింది. ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి ఎస్పీ శ్రీమతి జానకి షర్మిల ఐపీఎస్ గత రాత్రి ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న బాధితురాలిని సంఘటన స్థలాన్ని స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేయడం జరిగింది.
ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి ఎస్పీ మాట్లాడుతూ ప్రజలందరూ సంయమనం పాటించాలని సోషల్ మీడియా నందు ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరించే వదంతులను పుకార్లను నమ్మవద్దని అదేవిధంగా వాటిని సృష్టించి వ్యాప్తి చేసేవారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమేనని తెలియజేస్తూ తప్పుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు.
అదేవిధంగా నిందితులైన
A1) ఇంగోలే అనిల్,
A2) ఇంగోలే గంగాధర్,
A3) దుప్పాత్రే సుష్మ, లను సెక్షన్ 127(2),70(2),109(i) 351 (3) r/w 49 BNS 2023, sec 5(g) r/w 6 of పోక్సో యాక్ట్ 2012 తో క్రైమ్ నెంబర్ 42/2025 తో కేసు నమోదు చేయడం జరిగింది తెలిపారు. ఎలాంటి సందేహం లేకుండా, నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతుందని తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ఈ సందర్భంలో ఎవరు గుమికూడి ఉండకుండా, సభలు, సమావేశాలు నిర్వహించకుండా ఉండాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. పట్టణంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా గస్తీ, పెట్రోలింగ్, పికెట్స్ ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరిగిందని తెలిపారు. గత రాత్రి జిల్లా ఇన్చార్జి ఎస్పీతో పాటుగా ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు చేరువ చేయాలి

**- మార్కెటింగ్ రంగంపై దృష్టి సారించాలి - ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలి**







మహానంది, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):
ఉద్యాన పంటలు అభివృద్ధికి ఎంతో ఆసక్తి చూపిస్తున్న యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులకు చేరువ చేస్తూ వారి ఆదాయాలను పెంచడానికి నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. మహానంది సమీపంలో ఉన్న వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానంలో శనివారం కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో ఒకే రకమైన పంటలపై ఆధారపడటం రైతులకు నష్టాలను కలిగిస్తోందన్నారు. రైతులు వివిధ రకాల పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపేలా వారికి అవగాహన కల్పించాలని, అందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు సహకరించాలన్నారు. మార్కెటింగ్ సమస్యలు సైతం కీలక అంశాలుగా ఉన్నాయని, మార్కెటింగ్ వ్యవస్థలో మార్పులు తీసుకురావడం, రైతులకు సరైన ధరలు అందించడం, వారిని నేరుగా మార్కెట్లతో అనుసంధానం కల్పించడం ఎంతో అవసరం అని అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వ విధానాల ద్వారా రైతులకు మార్కెటింగ్ కొరకు సంబంధించిన సౌకర్యాలను కల్పించడం, ఆర్థిక సాయం అందేలా చేయడం ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కే. గోపాల్ మాట్లాడుతూ ఉద్యాన పరిశోధన స్థానాల్లో ఉద్యాన పంటలపై పరిశోధనలు చేస్తున్నామన్నారు. ఉద్యాన వాణిజ్య పంటలపై దృష్టి సారించామని, కొత్త పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, సీనియర్ సైంటిస్ట్ ఠాగూర్ నాయక్, కేసీ కెనాల్ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



మహానంది, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):
ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం మహానంది తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరించే కార్యక్రమం ఏర్పాటుకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పై నిర్లక్ష్యం వద్దన్నారు ప్రజలు అందించిన వినదు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, తహశీల్దార్ రమాదేవి, ఎంపీపీ యశశ్విని, సర్పంచ్ శిరీష, ఎంపీడీవో మొహమద్ దౌలా, ఈవో పాల్గొన్నారు.





# చుక్కల దుప్పికి గాయాలు



మహానంది, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):
మహానంది నుంచి ఫారం వెళ్లే మార్గంలో ఉన్న తెలంగాణ కాలువ వద్ద మంచినీళ్లు తాగేందుకు వెళ్లిన ఓ దుప్పి ప్రమాదవశాత్తు కాలువలో పడింది. అటుగా వెళ్తున్న నందిపల్లె గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు గుర్తించి వెంటనే కాలువలోకి దూకి దుప్పిని రక్షించారు. కాలువ గట్టుపైకి దుప్పిని తీసుకొని వచ్చి పరిశీలించగా కాళ్లకు గాయాలైనట్లు గుర్తించారు. అటవీశాఖ అధికారులకు పోలీస్ కానిస్టేబుల్ నారాయణస్వామి సమాచారం అందించారు.

## రేనాటి గడ్డ పులిబిడ్డ స్వర్గీయ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి,

# ఆయన పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

**ఎస్ వి మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కర్నూల్ వైస్సార్సీపీ అధ్యక్షులు.**





కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 22 ( రిపబ్లిక్ న్యూస్): కర్నూలు స్థానిక చాణిక్య పురి కాలనీ లో స్వర్గీయ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతిని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే ఎస్ వి మోహన్ రెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు శ్రీమతి ఎస్ వి విజయ మనోహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేనాటి వీరుడు బ్రిటిష్ వారిని గడ గడ లాడించిన మహావీరుడు స్వర్గీయ నరసింహ రెడ్డి అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సందర్భంగా ఎస్వీ దంపతులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ శబరి ,కర్నూలు ఎంపీ నాగరాజు పాణ్యం ఎమ్మెల్యే చరిత రెడ్డి మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి , కైపా పద్మలత రెడ్డి అదిమలపు సతీష్ రెడ్డి ,సంక్షేమ సంఘం నాయకులు అన్ని రాజకీయ పార్టీలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# కలెక్టరేట్లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి



**నంద్యాల ప్రతినిధి, ఫిబ్రవరి22, రిపబ్లిక్ న్యూస్**
ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, రేనాటి సూర్యుడుగా కొలవబడే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశం కోసం చేసిన త్యాగనిరతిని డిఆర్ఓ రాము నాయక్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. రెడ్డి సేవా సంఘం ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, మనోహర్ రెడ్డి, తిరుపం రెడ్డి, సాయిరాం రెడ్డి, శివకుమార్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను ఎదిరించి సాయుధ పోరాటం చేసిన విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. సాంప్రదాయ వ్యవసాయ వ్యవస్థలో బ్రిటిష్ వారు చేసిన మార్పులకు వ్యతిరేకంగా నరసింహారెడ్డి నిరసన తెలిపారన్నారు. 1806 నవంబర్ 24న కర్నూలు జిల్లాలోని రూపన గుడిలో జన్మించి స్వాతంత్ర సాధన కోసం బ్రిటిష్ పాలకులతో వ్యతిరేకంగా పోరాటం చేసి 1847 ఫిబ్రవరి 22న వీరమరణం పొందారన్నారు.

# శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం




**పాణ్యం ప్రతినిధి, ఫిబ్రవరి22,ప్రజా రిపబ్లిక్ న్యూస్ :**స్థానిక శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు శాంతిరాం మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సుబ్రహ్మణ్యం తెలిపారు. రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే నిస్వార్థ చర్య దీనివల్ల అవసరమైన వారికి సమయానికి రక్తాన్ని అందచేయవచ్చన్నారు. రక్తంలో ఇనుము స్థాయిని మరియు హృదయ సంబంధిత వ్యాధులను నియంత్రించడానికి రక్తదానము ఎంతో అవసరమని, యువతలో మానవతా విలువలు పెరుగుతాయని తెలియజేశారు. ప్రస్తుత దినాలలో కిడ్నీ డయాలసిస్, యాక్సిడెంట్స్ మరియు ఇతరత్రా వ్యాధుల ద్వారా బాధపడుతున్న వారికి మా కళాశాల తరపున రక్తదానం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, బ్లడ్ బ్యాంక్ ఇంచార్జ్ సురేష్, వైద్య సిబ్బంది మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# నంద్యాలకు బయలుదేరిన మహానందీశ్వర దంపతులు





మహానంది, ఫిబ్రవరి 22,( రిపబ్లిక్ న్యూస్): మహా నందీశ్వరుని ఉత్సవ మూర్తులు మహానంది క్షేత్రం నుండి నంద్యాలలోని బ్రహ్మనందీశ్వర స్వామి ఆలయానికి బయలుదేరాయి. ఆలయ ఈవో నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి ఏ ఈ ఓ మధు వేద పండితులు రవిశంకర్ అవధాని నాగేశ్వర శర్మ తదితరులు ప్రత్యేక పూజల అనంతరం మహానందీశ్వరుని ఉత్సవ మూర్తులు నంద్యాలకు బయలుదేరి వెళ్లాయి. మహానంది క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నంద్యాలలో వెలసిన బ్రహ్మనందీశ్వర స్వామిని పెళ్లి పెద్దగా ఆహ్వానించడానికి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రికి బ్రహ్మనందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులతో సహా మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులు మహానందికి చేరుకోనున్నాయి. ఈనెల 24 సోమవారం ధ్వజా ఆరోహణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మహానందిలో ప్రారంభం కానున్నాయి.

# ఈడీ అధికారులపై దర్శకుడు శంకర్ ఆగ్రహం




ప్రముఖ తమిళ సినీ దర్శకుడు శంకర్ కు ఈడీ షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'రోబో' సినిమాకు సంబంధించి నమోదైన కాపీరైట్ ఉల్లంఘన కేసులో శంకర్ కు చెందిన రూ. 10 కోట్ల విలువైన మూడు స్థిరాస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈడీ చర్యలపై స్పందించిన శంకర్... తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును కూడా పట్టించుకోకుండా ఈడీ అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడటం తనను ఎంతో బాధించిందని చెప్పారు. ఈడీ తీసుకున్న చర్యలను ఉద్దేశించి పలు విషయాలను ప్రజల దృష్టికి తీసుకురావాలనుకుంటున్నానని శంకర్ తెలిపారు. 'రోబో' సినిమాకు సంబంధించి నిరాధారమైన ఆరోపణలను చూపించి తనకు చెందిన మూడు స్థిరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేశారని చెప్పారు. 'రోబో' కథకు సంబంధించి ఆరూర్ తమిళ్ నాడాన్ వేసిన పిటిషన్ ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చిందని... ఆ తీర్పును విశ్వసించకుండా, కేవలం ఫిర్యాదు ఆధారంగా ఈడీ తన ఆస్తులను జప్తు చేసిందని అన్నారు. ఈడీ చర్య న్యాయపరమైన వాస్తవాలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. ఆస్తుల అటాచ్ మెంట్ ను సవాల్ చేస్తూ అప్పీల్ కు వెళతానని చెప్పారు. ఈడీ అధికారులు తమ చర్యలపై పునఃసమీక్ష జరుపుతారని భావిస్తున్నానని శంకర్ తెలిపారు.

# నాని సహ నిర్మాతగా చిరంజీవి చిత్రం



మెగాస్టార్ చిరంజీవి వరుసగా సినిమాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇకపై తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉంటుందని ఇటీవల ఓ కార్యక్రమంలో ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో 'దసరా' ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరంజీవి సినిమా చేయబోతున్నారు. ఈ సినిమాకు హీరో నాని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గురించి నాని కీలక అప్ డేట్ ఇచ్చారు. ఈ చిత్రం యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతుందని చెప్పారు. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. చిరంజీవి సినిమాల విషయానికి వస్తే... ప్రస్తుతం ఆయన 'విశ్వంభర' షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. వేసవికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తదుపరి చిత్రం అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేయనున్నారు. నాని విషయానికి వస్తే... ప్రియదర్శి ప్రధాన పాత్రలో నాని సమర్పణలో 'కోర్ట్' సినిమా తెరకెక్కింది. వచ్చే నెల 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాకు సంబంధించి నాని ప్రచార కార్యక్రమాలను కూడా మొదలు పెట్టారు. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో నాని మాట్లాడుతూ... చిరంజీవి సినిమా గురించి అప్ డేట్ ఇచ్చారు.

# హీరో రామ్‌ను కలిసిన మంత్రి కందుల దుర్గేష్

కథానాయకుడు రామ్ తన తాజా చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం మహేష్ బాబు.పి దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. భాగ్య శ్రీ బోర్సే నాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై యలమంచిలి రవిశంకర్, మహేష్ బాబు.పి నిర్మిస్తున్నారు. 'డబుల్ ఇస్మార్ట్' వంటి భారీ పరాజయం తరువాత హీరో రామ్ నటిస్తున్న చిత్రమిది. రామ్ కెరీర్‌లో 22వ చిత్రంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ఇంకా టైటిల్ నిర్ణయించలేదు.ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. కాగా ఈ చిత్రం షూటింగ్ సెట్‌ను శనివారం (ఈ రోజు) ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా రామ్ పోతినేనితో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ "రామ్‌లోని ఎనర్జీ, డ్యాన్సులు నాకెంతో ఇష్టం. రబ్బరు స్ప్రింగ్ తరహాలో బాడీని డ్యాన్స్ మూమెంట్స్‌తో మౌల్డ్ చేస్తాడు. ఇప్పటి వరకు ఏపీలో ఉన్న పర్యాటక ప్రాంతాల్లో, గోదావరి నది తీర ప్రాంతాల్లో చిత్రీకరణ చేసిన సినిమాలు దాదాపుగా విజయాలుగా నమోదు చేసుకున్నాయి.ఈ సినిమా కూడా ఆ కోవలోనే విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. ఇక రెండు వారాల క్రితం ఈ సినిమా చిత్రీకరణ రాజమండ్రిలో మొదలైంది. ఈ చిత్రీకరణ కోసం హాజరైన హీరో రామ్‌కు ఇక్కడ ఆయన అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మధు నీలకందన్, సంగీతం: వివేక్.






# ఓటిటికి ముందే టీవిల్లో సక్రాంతికి వస్తున్నాం

విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాఓటిటికి ముందే టీవీలో ప్రేక్షకులను అలరించనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించారు. ఈ సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓటీటీ లవర్స్‌కి షాక్ ఇస్తూ.. ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సినిమాను ఓటీటీ కంటే ముందుగా టీవీలో టెలికాస్ట్ చేయబోతున్నట్లు ప్రకటించింది. మార్చి 1 సాయంత్రం 6 గంటలకు జీతెలుగులో ఈ సినిమా ప్రీమియర్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. మరోవైపు ఈ చిత్రం ఓటీటీ తేదీ మరింత ఆలస్యం కాబోతున్నట్లు తెలుస్తుంది.

# ఆర్సీ 16 లో ప్రగ్యాజైశ్వాల్ ?



ముంబై బ్యూటీ ప్రగ్యాజైశ్వాల్ టాలీవుడ్ లో మళ్లీ బిజీ అవుతోందా? స్టార్ హీరోల చిత్రాల్లోనే అవకాశాలు అందుకుంటుందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. ఈ సంక్రాంతి కి రిలీజ్ అయిన 'డాకు మహారాజ్' లో నటించింది. ఆ సినిమా మంచి విజయం సాధించింది. ఆ రకంగా బాలయ్య అవకాశం ఇవ్వడంతో? మరో సక్సెస్ ఖాతాలో నమోదైంది. కొత్త ఏడాదిని అమ్మడు అలా లాంచ్ చేసింది. అటుపై వెంటనే అదే బాలకృష్ణ తో 'అఖండ2' లోనూ ఛాన్స్ అందుకుంది. ఇది పాన్ ఇండియా చిత్రం. బోయపాటి శ్రీను భారీ కాన్వాస్ పై తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాలో ఛాన్స్ రావడంతో ప్రగ్యా ఇమేజ్ రెట్టింపు అయింది. అలాగే సాయి శ్రీనవాస్ బెల్లంకొండ నటిస్తోన్న 'టైసన్ నాయుడు'లోనూ నటిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడికి మరో బంపర్ ఆఫర్ కూడా వరించినట్లు తెలుస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో చరణ్ కి జోడీగా ఇప్పటికే జాన్వీ కపూర్ నటిస్తోంది. ఈనేపథ్యంలో ఇదే సినిమాలో ప్రగ్యా జైశ్వాల్ ని ఓ కీలక పాత్రకు ఎంపిక చేసినట్లు సమాచారం. సినిమాలో ఆ పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుందని మెగా లీకులందుతున్నాయి. ప్రగ్యా జైశ్వాల్ రోల్ చాలా మాసివ్ గా ఉంటుందిట. తొలుత ఆ పాత్ర కోసం అనసూయని తీసుకోవాలనుకున్నారుట. కానీ ఆమె ఇప్పటికే 'రంగస్థలం'లో మాస్ రోల్ చేయడంతో? ఫ్రెష్ నెస్ రాదని భావించి బుచ్చిబాబు ఫాంలో ఉన్న ప్రగ్యా జైశ్వాల్ అయితే బాగుటుందని అమెని అప్రోచ్ అయినట్లు వినిపిస్తుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలి.

# ఆది పినిశెట్టి 'శబ్దం'..



టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి ఇప్పుడు శబ్దం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దర్శకుడు అరివళగన్ తెరకెక్కిస్తున్న ఆ సినిమాలో లక్ష్మీ మీనన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఇప్పటికే అరివళగన్, ఆది పినిశెట్టి కాంబోలో వైశాలి మూవీ వచ్చి అందరినీ ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు శబ్దం మూవీపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఆది పినిశెట్టి పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ పాత్రలో నటిస్తున్న ఆ సినిమా.. ఫిబ్రవరి 28వ తేదీన థియేటర్లలో రిలీజ్ కానుంది. రీసెంట్ గా శబ్దం మేకర్స్.. ట్రైలర్ ను రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమాపై ఆడియన్స్ లో పాజిటివ్ బజ్ నెలకొంది. సైకలాజికల్ ఇన్‌స్టిగేటివ్ థ్రిల్లర్ గా మూవీ ఉండనున్నట్లు.. ఇప్పటికే క్లియర్ గా అర్థమైంది. గబ్బిలాల శబ్దంతో బాధపడుతున్న ఓ మహిళ చుట్టూ సినిమా సాగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. గబ్బిలాలు, దెయ్యం లాంటి సన్నివేశాలు... ఆడియన్స్ లో సినిమాపై మరింత ఆసక్తిని రేపుతున్నాయని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అయితే ఇప్పుడు శబ్దం మేకర్స్.. పాత అండ్ రిస్కీ ట్రెండ్ ను ఫాలో అయ్యారు. అదేంటంటే.. గతంలో నిర్మాతలు తమ సినిమాలను అధికారిక విడుదలకు ముందే పంపిణీదారుల కోసం ప్రదర్శించేవారన్న విషయం తెలిసిందే. దాని ఆధారంగా థియేట్రికల్ బిజినెస్ నిర్వహించేవారు. కానీ కొద్ది రోజులుగా అలా జరగడం లేదు. ఇప్పుడు శబ్దం.. ఆ ట్రెండ్ ను రీస్టార్ట్ చేసింది. ఎందుకంటే శబ్దం థియేట్రికల్ రైట్స్ ను కొనుగోలు చేయడానికి డిస్ట్రిబ్యూటర్స్ పెద్ద ఆసక్తి చూపలేదని ఆ మధ్య వార్తలు వచ్చాయి. దీంతో నిర్మాతలు అవుట్ పుట్ పై చాలా నమ్మకంగా ఉండటంతో ఏరియా వారీగా పంపిణీదారుల కోసం ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాటు చేశారు.

# ఉపాధ్యాయుల చూపు వంగ మహేందర్ రెడ్డి వైపు



## దూసుకెళ్తున్న పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి విఎంఆర్

- విఎంఆరు మద్దతుగా ఇప్పటికే పలు ఉపాధ్యాయ, అధ్యాపకసంఘాలు ఏకగ్రీవ తీర్మానం

- గెలుపు దీమాలో పిఆర్ టియూ శ్రేణులు

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

**ఫిబ్రవరి 22 (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ఉమ్మడి కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకుసమయం సమీపిస్తుంది. ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. అంటే, ప్రచారానికి కేవలం నాలుగైదు రోజుల గడువు మాత్రమేమిగిలి ఉంది. దీంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంజిల్లాల్లో ఊపందుకుంది. పోటా పోటీగా అభ్యర్థులు ప్రచారంచేస్తూ వోటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపాధ్యాయఎమ్మెల్సీ స్థానానికి పిఆర్టీయూ అభ్యర్థిగా సిద్దిపేట-రంగధాంపల్లికిచెందిన వంగ మహేందర్రెడ్డి(విఎంఆర్) పోటీలో ఉన్నాడు. మహేందర్రెర్రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రచారంలో భాగంగా ఉదయం వాకింగ్కు వెళ్లే టీచర్లను కలుస్తూరాత్రి వరకు ఏదో ఒక మీటింగ్లో పాల్గొంటున్నాడు. టీచర్లనుఅప్యాయతతో పలకరిస్తూ... తనను చట్ట సభలోకి పంపిస్తే చేయనున్నపనులు వివరిస్తున్నాడు. ప్రచారంలో దూసుకెళ్తున్న ఉపాధ్యాయఎమ్మెల్సీ అభ్యర్థి విఎంఆర్ను గెలిపిస్తామంటూ పలు ఉపాధ్యాయ,అధ్యాపక సంఘాలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ఒక మాటలోచెప్పాలంటే మహేందర్రెడ్డికి సంఘాలకతీతంగా మద్దతు లభిస్తుంది. పిఆర్టీయూ నాయకులు నిస్వార్థంగా పాఠశాలలకు, ఉపాధ్యాయులకుసేవలందిస్తున్న దృష్ణా... ఆయన వ్యక్తిత్వాన్ని చూసి సంఘాలకతీతంగా ఉపాధ్యాయులంతా మద్దతునిస్తున్నట్లు టిఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడుకటకం రమేష్ తెలిపాడు. సమాజంలో విద్యావ్యవస్థను కబళించడానికివొస్తున్న కార్పొరేట్ శక్తులను వోడించి విఎంఆర్లాంటి సామాజికవేత్త,మద్దతును ప్రకటించినట్లు చెప్పాడు. అదే విధంగా ఉమ్మడి జిల్లాలలోని13జిల్లాలలో నియోకజకవర్గాల వారీగా ప్రధానోపాధ్యాయులసమావేశం నిర్వహించి విఎంఆర్కు మద్దతు ప్రకటించిగెలిపించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. విఎంఆర్నుఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యావ్యస్థకు లాభం అని భాషోపాధ్యాయసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కృష్ణ అన్నారు. జోరుగా, హుషారుగా ప్రచారం..విద్యావేత్తను గెలిపించాలనీ, ఆయన సేవలను గుర్తించి సంపూర్ణప్రచారం ఉధృతంగా జోరుగా, హుషారుగా సాగుతోంది. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానం 13 జిల్లాలకు విస్తరించి ఉండడంతోఅభ్యర్థులకు నేరుగా వోటర్లను కలిసే పరిస్థితి లేకపోవడంతో వారిసెల్ నంబర్లు సేకరించి వాయిస్ మెస్సేజ్లు, ఎస్ఎంఎస్ నుపంపిస్తున్నారు. ఒక్కో అభ్యర్థి కనీసం రెండు సార్లయినా వాయిస్ ద్వారా తమ పేరు చెప్పుకుంటూ బ్యాలెట్పేపర్లో తమ సీరియల్ నంబర్ చెబుతూ మొదటిప్రాధాన్యత వోటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. వోటర్లకువారి సెల్ ఫోన్లకు ఎస్ఎంఎస్లు పంపిస్తున్నారు. ఈఎస్ఎంఎస్ వోటరు పేరు, పోలింగ్ స్టేషన్ నంబర్,చిరు నామాతో పాటు అక్కడి జాబితాలో వోటరు సీరియల్నంబర్, పోలింగ్ తేదీని పేర్కొంటున్నారు. అలాగే ఎక్కడికక్కడే వాట్సప్ గ్రూపులను సైతం ఏర్పాటు చేసి ప్రచారంచేస్తున్నారు. వంగ మహేందర్రెడ్డిని భారీ మెజారిటీతోగెలిపించుకోవడానికి పిఆర్టియూ రాష్ట్ర, జిల్లా, మండలనాయకులంతా రంగంలోకి దిగారు. నేతలు అవసరమైతేమండలాల వారీగా కూడా పలు చోట్ల మీటింగ్లు పెట్టివోటర్లను నేరుగాల కలిసి ఉత్సాహపరుస్తున్నారు. మహేందర్రెడ్డి సొంత జిల్లా అయిన సిద్ధిపేట జిల్లాలోవోటింగ్ వన్ సైడ్ ఉండేలా అభ్యర్థి విఎంఆర్తో పాటుపిఆర్టీయూ నేతలు, ఆయన శ్రేయోభిలాషులు, స్నేహితులు,బంధువులు శ్రమిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక్కవోటు కూడా మిస్ కాకుండా, వివెంజర్కు గంపగుత్తగాపడేలా చాలా పకడ్బందీగా ఎన్నికల ప్రచారాన్నినిర్వహిస్తున్నారనీ తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్నప్రచారం తీరు, వొస్తున్న ఆదరణ చూస్తుంటే ఉపాధ్యాయఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం 'వార్ వన్ సైడ్' అన్నట్లుగానే ఒటుందని అంచనా వేస్తున్నారు.ఎమ్మెల్సీగా గెలిపిస్తే... ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిఆర్టీయూ అభ్యర్థిగా పోటీ చేస్తున్నవంగ మహేందర్ రెడ్డి టీచర్ స్వచ్ఛంద పదవీ విరమణతర్వాత విఎంఆర్ ఫౌండేషన్ స్థాపించికరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో డ్రెస్సులు, ప్లే మెటీరియల్, ఉపాధ్యాయులు, పాఠశాలల1000 పాఠశాలలకు విద్యార్థులకు సంబంధించిన స్కూల్కోసం మౌలిక వసతులు, కంప్యూటర్లు, సౌండ్ సిస్టం ఇలాఎన్నో విఎంఆర్ ఫౌండేషన్ ద్వారా సేవలు అందించారు. రాష్ట్రంలో అత్యంత బలమైన ఏఆర్టియూ సంఘంతరపున ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వంగ మహేందర్రెడ్డిగత కొన్ని నెలలుగా కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలలో విస్తృతంగాపర్యటించారు. ప్రచారంలో అందరికంటే ముందు వరుసలోఉన్నాడు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్ టియూ సంఘంబలపరిచిన అభ్యర్థి అయిన తనకు మొదటి ప్రాధాన్యతవోటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలనీ, తనను ఎమ్మెల్సీగాచట్ట సభలోకి పంపిస్తే చేయనున్న పనులను సభ్యులకు అర్థమయ్యేలా ప్రసంగిస్తున్న ఉపన్యాసాలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. మహేందర్రెడ్డి సమావేశంనిర్వహించిన ప్రతి చోటా సభ్యుల నుండి అనూహ్యమైన స్పందన లభిస్తుంది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో శ్రేణులుపాల్గొంటున్న విఎంఆర్... 317 జీవో బాధిత ఉపాధ్యాయులందరికీ తక్షణమే న్యాయం చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. కేవలం మ్యూచువల్, స్పౌస్, హెర్లాండ్సే కాకుండా సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించిస్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికీ న్యాయంచేయాలన్నారు. ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల సమస్యల పట్లతగువిధంగా స్పందించి పరిష్కరించే విధంగా ప్రయత్నంచేస్తానని అన్నారు. సిపిఎస్ రద్దుకు పిఆర్ టియూ సంఘంపోరాటం నిర్మిస్తుందనీ, ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాతపెన్షన్ సాధించి పెడతామని కెజిబివి ఉపాధ్యాయులకుత్వరలోనే మినిమం టైమ్ స్కేల్ ఇప్పిస్తామని, ఉపాధ్యాయులకే కాకుండా మోడల్ స్కూల్ గురుకుల ఉపాధ్యాయులందరికీ అన్ని కార్పొరేట్ హాస్పిటల్లో వర్తించేవిధంగా హెల్త్ కార్డులు ఇప్పిస్తామని, గురుకుల సమయాన్నిమార్పిస్తామనీ, మోడల్ స్కూల్కు జీరో వన్ జీరో కిందజీతాలు ఇప్పిస్తానన్నారు. విద్యారంగా అభివృద్ధికి ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీగా గెలిచిన ఆరు నెలలోపు సిపిఎస్ రద్దుకుపెద్దయెత్తున ఉద్యమాన్ని నిర్మించడంతో పాటు పిఆర్జీయూరాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో టీచర్లు ఎదుర్కొంటున్న మిగతాసమస్యలను పరిష్కారానికి కృషి చేస్తాననీ, ఎమ్మెల్సీగా నన్నుఆశీర్వదిస్తే ఉపాధాయ్య లోకం రుణం తీర్చుకుని సంఘంమార్గదర్శకత్వంలో నిరంతరం నిస్వార్థంగా ఉపాధ్యాయులకోసం, విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయులఆకాంక్షలకనుగుణంగా నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీగా చట్టసభకు పంపిస్తే ఒక మంచి వ్యవస్థగా పనిచేస్తాననీ, ఎమ్మెల్సీ నిధుల నుండి ప్రతి రూపాయి ప్రభుత్వపాఠశాల కోసం, ప్రభుత్వ విద్యారంగం కోసం ఖర్చువిద్యార్థుల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేస్తాననిచేస్తానని, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయులు,ఉపాధ్యా ఎమ్మెల్సీ పిఆర్ టియూ అభ్యర్థి వంగమహేందర్రెడ్డి హామీ ఇచ్చారు. పిఆర్టీయూ ఎమ్మెల్సీఅభ్యర్థులు గెలిస్తే విద్యా వ్యవస్థకు లాభం జరుగుతుందనీ,మిగతా వారెవరూ గెలిచినా రాజకీయ పార్టీలకు లాభంజరుగుతుందనీ, ఈ విషయాన్ని గ్రహించి, అలోచించి ఈఎన్నికల్లో పిఆర్ టియూ అభ్యర్థులను ఎమ్మెల్సీలుగాగెలిపించాలన్నారు. పిఆర్టీయూ అభ్యర్థుల గెలుపు చారిత్రకఅవసరం అని వంగ మహేందర్రెడ్డి అన్నారు. ఇదిలా ఉ ంటే,రాష్ట్రంలో అతి పెద్ద సంఘమైన పిఆర్ టియూ,అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల, ఉపాధ్యాయఎమ్మెల్సీ ఎన్నికల్లో పరస్పరం సహకరించుకోనుండటంతోఈ రెండు ఎమ్మెల్సీ సీట్లను కాంగ్రెస్, పిఆర్టియూ చాలాఈజీగా తమ ఖాతాల్లో వేసుకునే అవకాశం ఉందనిఅటు అధికార కాంగ్రెస్ పార్టీ, ఇటు పిఆర్ టియూ నేతలుగట్టి దీమాలో ఉన్నారు. చూడాలి మరి!

# ఏపీకి టెస్లా.....

## ప్రపంచ కుభేరుడికి ఆఫర్లే.. ఆఫర్లు..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):** ప్రపంచ కుభేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన ఈవీ కార్ల కంపెనీ టెస్లా కోసం దేశంలో పలు రాష్ట్రాలు పోటీపడుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీ, ముంబైల్లో కొన్ని స్థలాలు చూసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆ స్థలాలు అవుట్ లెట్ల కోసమేనంటూ టెస్లా ప్రతినిధులు చెబుతున్నారు. మరోవైపు భారత మార్కెట్లోకి ప్రవేశానికి సిద్ధమవుతున్న సంస్థ ఇప్పటికే నియామకాల ప్రక్రియ మొదలు పెట్టింది. దీంతో టెస్లా కంపెనీ ప్లాంట్ ను దక్కించుకునేందుకు పలు రాష్ట్రాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్ర చురుగ్గా పావులు కదుపుతుండగా, టెస్లాను ఏపీకి రప్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగారు. ఇప్పటికే మంత్రి నారా లోకేశ్ ద్వారా ఓ సారి టెస్లా ప్రతినిధులతో చర్చించిన ఏపీ ప్రభుత్వం.. ఈవీ కార్ల కంపెనీ స్థాపనకు ఏపీ అనుకూలంగా ఉంటుందని తాజాగా మరో లేఖ రాసింది. అంతేకాకుండా ఆ సంస్థను ఏపీకి రప్పించేందుకు భారీ ఆఫర్లు ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అమెరికాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా. ప్రస్తుతం అమెరికా నుంచే ఈ కార్లు దిగుమతు అవుతున్నాయి. అయితే దిగుమతి సుంకాలు ఎక్కువగా ఉండటం వల్ల టెస్లా కార్ల ధర ఎక్కువగా ఉంటోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం భారత్ లో అధిక దిగుమతి సుంకాలు వల్ల తమ ఉత్పత్తులు అమ్ముకోలేకపోతున్నామని ఇటీవల ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇక కార్ల మార్కెట్ కు దేశంలో ఎక్కువ అవకాశాలు ఉండటంతో స్థానికంగా పరిశ్రమ స్థాపించి ఉత్పత్తి చేస్తే భారత మార్కెట్లో పుంజుకోవచ్చని టెస్లా భావిస్తోంది. దీంతో దేశంలో ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలిస్తోంది. అయితే టెస్లా




పరిశ్రమ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉన్నందున దేశంలో పలు రాష్ట్రాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. టెస్లాను తమ రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తే అన్ని వనరులు సమకూరుస్తామని మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలు ఒత్తిడి చేస్తున్నట్లు పారిశ్రామిక వర్గాల్లో టాక్ నడుస్తోంది. అయితే ఈ రెండు రాష్ట్రాలను వెనక్కి నెట్టేస్తూ ఏపీ ఈ రేసులోకి దూసుకొచ్చిందని చెబుతున్నారు. టెస్లా యాజమాన్యాన్ని టెంప్ట్ చేసేలా ఏపీ ప్రభుత్వం పలు ఆఫర్లు ఇస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా అమెరికా నుంచి దిగుమతుల కోసం టెస్లాకు ఏకంగా ఓ పోర్టు అప్పగిస్తామని ప్రతిపాదించినట్లు ప్రచారం జరుగుతోంది. టెస్లా ప్లాంట్ ను రాష్ట్రానికి తెచ్చేందుకు గత ఏడాది నుంచే ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెబుతున్నారు. గత అక్టోబరులో అమెరికా పర్యటనకు వెళ్లిన మంత్రి నారా లోకేశ్ టెస్లా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వైభవ్ తనేజాతో సమావేశమయ్యారని గుర్తు చేస్తున్నారు. టెస్లాను ఏపీకి రప్పించేందుకు రాష్ట్ర ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డు (ఈడీబీ) అవసరమైన స్థలాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతోంది. రాష్ట్రానికి పోర్ట్ కనెక్టివిటీ ఉండటంతో సముద్ర మార్గం ద్వారా టెస్లా దిగుమతులు, ఎగుమతులకు సౌకర్యంగా ఉంటుందని ప్రభుత్వం సూచిస్తోందని చెబుతున్నారు. అంతేకాకుండా దేశంలో ఎలక్ట్రానిక్ వాహనాలకు ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో గిరాకీ ఉంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న ఈవీ కార్లలో 60 శాతం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోనే ఉన్నాయని అంటున్నారు. దీంతో దక్షిణాదిలో టెస్లా ప్లాంట్ ప్రారంభిస్తే దేశంలో వేగంగా ఉనికిని చాటుకునే అవకాశం ఉందని ఏపీ ప్రభుత్వం సలహా ఇస్తోంది. ఫ్యాక్టరీ ఏర్పాటుకు అన్నివనరులు సమకూర్చుతామని, పూర్తి సహకారం అందిస్తామని ప్రతిపాదిస్తోంది. ఏపీ ఆఫర్లతో ఇతర రాష్ట్రాలు వెనకడుగు వేస్తున్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి పెట్టుబడుల వేటకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో రూ.7 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయి. కొద్దిరోజుల్లో ఈ పెట్టుబడులు గ్రౌండింగ్ అయ్యేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులను సింగిల్ విండోలో పరిష్కరిస్తోంది. ఈ నేపథ్యంలో టెస్లాను కూడా ఏపీలో పెట్టేలా ఒత్తిడి చేస్తోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంలో తనకు ఉన్న పలుకుబడిని ముఖ్యమంత్రి చంద్రబాబు వాడుకుంటున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో చంద్రబాబు మాటకు ప్రధాని మోదీ కూడా అధిక ప్రాధాన్యమిస్తుండటంతో టెస్లా ఏపీకి వచ్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని అంటున్నారు.

### శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా

# గుడి పరిసరాలు, క్యూ లైన్ లను పరిశీలన

కంపార్ట్మెంట్లలో వేచి ఉన్న భక్తులు సమయమనం పాటిస్తూ దర్శనం చేసుకోవాలి

విధులలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ ఎస్పి యుగంధర్ బాబు



**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 22, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పరిధిలోని శ్రీశైలంలో జరుగుచున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో శ్రీశైలంనకు వచ్చు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేసిన క్యూలైన్స్, గుడి పరిసరాలు మొదలగు వాటిని శనివారం జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు పరిశీలించి అక్కడ విధులలో ఉన్న ఆలయ అధికారులకు, పోలీస్ అధికారులకు ,సిబ్బందికి పలు సూచనలు చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూలైన్ లలో వేచివున్న భక్తులకు మంచి నీరు, టాయిలెట్స్ ఇలా కనీస సదుపాయాలు కల్పించాలి. కంపార్ట్మెంట్లలో వేచి ఉన్న భక్తులు సమయమనం పాటిస్తూ ఎలాంటి తొక్కిసలాటకు తావు లేకుండా దర్శనం చేసుకోవాలని సూచించారు. భక్తులకు ఏదైనా అనారోగ్య సమస్యలు ఏర్పడితే మందులు అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉంచుకోవాలి. క్యులైన్స్ లలో ఎలాంటి తొక్కిసలాట జరుగకుండా అక్కడ విధులలో ఉన్న సిబ్బందికి అప్రమతంగా ఉండాలి. ఆలయ పరిసరాల్లో బందోబస్తు లో ఉన్న సిబ్బంది అధికారులు నిరంతరము అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. క్యూలైన్ లలో వేచివున్న భక్తులకు దర్శనంనకు ఎంత సమయం పడుచున్నది సహేతుకమైన కారణాలను మైక్ ల ద్వారా సమాచారం అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఏఈవేణు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com